పున్నామనరకాన్ని
తప్పించాల్సిన కొడుకు
బ్రతికుండగానే
నరకం చూపుతుంటే
ఓ తల్లి పడిన ఆవేదన!

# ఆలోచించు




డియర్ శ్రీధర్!

ఎప్పుడూ నోరెత్తి ఒక మాట అనని అమ్మ యిన్ని దెప్పుళ్లు ఎందుకు దెప్పిందా, ఏనాడు టెలిగ్రాం మేటర్‌లా ఉత్తరం వ్రాయడమేగాని, యింత తీరికగా అంత పెద్ద ఉత్తరం వ్రాయని అమ్మ చాల చాల వ్రాసింది అని ఇది చదువుతూ నీవు అనుకోవచ్చు. నిన్ను ఇది వ్రాస్తూ ఒక్కటే కోరుతున్నాను. ఉత్తరం మధ్యలో ఆపెయ్యక పూర్తిగా చదువు. నేను ఎందుకు ఇదంతా వ్రాసానో నీకు అర్థం అవుతుంది.

నీకు ఒక అక్క మంజుల, ఒక చెల్లి మృదుల ఉన్నారు. మీ నాన్న మొదట అమ్మాయి పుట్టిందని నీరసించి పోయారు. రెండవ సారయినా కొడుకు పుట్టాలని కోటి దేవుళ్లకు మొక్కుకున్నారు. నీవు పుట్టావు. నాన్నగారి సంతోషం అంతా యింతా కాదు. నీవు పుట్టిన నాటి నుండి ఇంట్లో రోజూ పండుగే. ఆ తరువాత మృదుల పుట్టింది. నాన్నగారు పెద్దగా బాధపడలేదు. కారణం కొండంత కొడుకువి నీవున్నావని.

చిన్నప్పటి నుండి, నీవు ఫలానాది కావాలని అడగకుండానే మీ నాన్నగారు అన్నీ అమర్చేవారు. అక్కను పదవ తరగతి నుండి ఖర్చులు భరించలేక స్కూలు మాన్పించేసారు. ఆమెకు పెట్టవలసిన పెట్టుబడి కూడా నీకు పెట్టడం మొదలు పెట్టారు. కారణం నీవు పున్నామ నరకం నుండి రక్షించే పుత్రుడివి. ఆడపిల్లలకు కడుపునిండా అన్నంలేకపోయినా ఫరవాలేదు. ఆయన దృష్టిలో కొడుకు మాత్రం రాజాలా బ్రతకాలి అనే బూజు పట్టిన భావాలతో ఉండేవారు.




ఆడపిల్లలకు రూపాయి గాజులుగాని, తలలోకి సన్నజాజులు గాని కొనాలంటే వందసార్లు ఆలోచించేవారు. ఆయన ఆశల్ని ఫలింపచేస్తూ నీకు అంతా ఖర్చుపెట్టినందుకు ఫలితం దక్కింది ఇంజనీరు వయ్యావు. అప్పుడు ఎనలేని సంతోషం. ఎవరెస్టు ఎక్కినంత సంబరం నాన్నగారి బాధ్యతలు నీనెత్తిన వేసికొని అక్క చెల్లెళ్ల పెళ్లి

చేస్తావని, మనకు డబ్బు సహాయం చేసిన మీ నాన్నగారి స్నేహితుని కుమార్తెను వివాహం చేసికుంటావని కలలతో ఆకాశంలో విహం గాల్లా ఇద్దరం విహరించాము. కాని కొద్ది రోజుల్లోనే రెక్కలు తెగిన పక్షుల్లా నేలమీదికి ఒరిగాము.

కారణం నీవు మాధురిని ప్రేమించానం టూ ఎనౌన్స్ చేయడమే. నీవు, మొదటి జీతం చేతికి రాకుండానే మాధురి మెడలో మూడు ముడులు వేసావు. గొప్పింటి పిల్లకు భర్తగా, కేవలం మాధురి భర్తగా మిగిలిపో యావు. కనీసం తల్లిదండ్రుల గురించి గాని, అక్కచెల్లెళ్ల గురించిగాని ఆలోచన లేదు. అంత కాలం పరిస్థితులు చక్క బడతాయి అని ఆలోచించిన అక్క అవి చక్కబడవు, మనమే చక్కదిద్దుకోవాలి అని గ్రహించి, కట్నం ఇస్తే ఎన్నో పెద్దపెద్ద సంబంధాల వాళ్లు చేసికుంటామని, వచ్చినా వద్దని తనకంటే ఒక స్థాయి క్రింద ఉద్యోగస్తుణ్ణి వివాహమాడింది. నీవు ఒక మెట్టు పైకెళ్లి మాకు దూరమయ్యావు. అక్క ఒక చెట్టు క్రిందికి దిగి మాకు దగ్గరయింది. భావ భాస్కర్‌కి ఈ ఊరిలోనే ఉద్యోగం కాబట్టి తన పిల్లలను నేను చూడక తప్పదు కాబట్టి మన యిల్లు ఇరుకైనా ఒక భాగంలో సర్దుకుపోయింది. తన మిషను మీద సంపాదించిన దానితోనే ఇంటర్, బి.ఎ., ఎం.ఏ. కూడా చదివింది. నాన్నగారి ని ఏ విధంగానూ ఇబ్బంది పెట్టలేదు.

నీవు ఏనాడూ కోడలిని ఇక్కడకు తీసికొని రాలేదు. ఆమెకు ముందే తెలియదా మనం పేదవాళ్లమని. పేదరికం నుండి వచ్చిన భర్త కావాలి గాని, పేదరికం వద్దు అంటే ఎలా? అసలు నీవే మాధురిని ఇక్కడకు తీసికొని రాలేదు. ఎప్పుడో నాన్నగారికి ఒంట్లో బావుండలేనప్పుడు వచ్చి, ఆయనకు ఏ విధమైన ఆర్థిక సహాయం చేయకుండానే, ఇంట్లో అక్క అప్పనంగా, అద్దె లేకుండా ఉంటున్నందుకు ఆమెలేని సమయంలో నా మీద విరుచుకుపడ్డావు.

అక్కకు మేము అద్దె లేకుండానే యిల్లు ఇచ్చాము. నాన్నగారు పనిపోయి నప్పుడు నీవు ఢిల్లీలో ఉన్నావు. ట్రయిన్‌లో వస్తే నాన్నగారి బాడీ అందదు. విమానంలో రావడానికి తుఫాను కారణంగా విమానాలు తిరగడం లేవని చావుకే రాలేదు. అప్పుడు అక్క నాకు చెప్పకుండా 'బయట ఉంటే అద్దె ఇవ్వమా?' అంటూ నెలనెల కొంత మా కోసం బాంక్‌లో వేసిన డబ్బు తీసి నాన్నగారి కోసం ఖర్చు పెట్టి పెద్ద కూతురు అయినందుకు ఆ విధంగా ఋణం తీర్చుకు ంది. 'కన్నీటి బిందువులకన్న చిరునవ్వులే నిజమైన సంపద అన్నది ఆమె జీవితానుభవ ంలో నేర్చుకుంది. అందుకే సంసారంలో ముత్యాల సరాల్ని అందంగా పేర్చుకొని హాయిగా జీవిస్తుంది. మన బాధలకు కారణా లు ఏవైనా కావచ్చుగాని దానికోసం శ్రీధర్ ని ఏమీ అనవద్దు అనేవారు మీ నాన్నగారు. మీ నాన్నగారి మాటను ధిక్కరించి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. ఎందుకు వ్రాస్తున్నా నో చివరి వరకూ మాత్రం చదువు.

వేరుని మరచిన చెట్టులా జీవితంలో మాకు వేప చేదునే మిగిల్చి బతికేస్తున్నావు నీవు. ఏ ఆదర్శమూ లేని వ్యక్తి తెడ్డులేని

పడవ వంటివాడు అంటారు. జీవితాన్ని నిస్సారం చేసికోవద్దు. కేవలం భార్య మెప్పు సంపాదించాలని మాత్రం జీవించవద్దు. ఆమెకు మంచి చెడులు, పేద గొప్పలు వివరించి నా దారికి మళ్లించుకో. ఆమె చిన్నపిల్ల. ఇంకా ఏమీ తెలియనిది. కొత్తగా అందిన సుఖాలు కొత్త బాధలు ప్రసాదిస్తాయి. నీకు అందిన సుఖాలు నిన్ను కన్నవారిని, తోబుట్టువులను దూరం చేసాయి.

ఇంక చెల్లి మృదుల విషయానికి వస్తే పెళ్లి విషయంలో యధావిధిగానే కప్పదాటు కారణాలు చెప్పి ఆమెకూ పెళ్లి చేయలేక పోయావు. నాన్నగారికి కంటి ఆపరేషను జరిగితే ఆమె ట్యూషన్లు చెప్పి ఆ ఖర్చుని గట్టెక్కించింది. దగ్గర ఉండి కంటికి రెప్పలా నాన్నగారిని కాపాడింది.

తనకి యూనివర్శిటీలో చేరాలని గాఢమైన కోరిక ఉన్నా బయట పడలేదు. అది గ్రహించి మంజుల ఆ ఖర్చులు తాను భరించి, చదివించింది. పి.హెచ్.డి. చేసింది. మెరిట్ స్కాలర్‌షిప్‌తో తను, తన చదువు తాను చదువుకుంది. మమ్మల్ని ఏ విధంగానూ నొప్పించలేదు.

ఎవరో కులాంతర వివాహాలు జరిపిస్తున్నారని తెలిసి ఆదర్శంగా ఆ వివాహం చేసికుంది. ఆమె దృష్టిలో అది ఆదర్శం. మా దృష్టిలో అది కట్నం ఇచ్చుకోలేని నిస్సహాయత. ఒక విధంగా మృదుల మంచి పనే చేసింది. మృదుల తను ఉద్యోగం చేస్తూ కూడా ఏనాడు మమ్మల్ని గాని, అత్తమామల్ని గాని నిర్లక్ష్యం చేయలేదు. పరిస్థితులను అర్థం చేసుకుంటూనే ఒక దరికి చేరింది. మన సమాజంలో రెండు నీతులున్నాయి. ఒకటి బోధిస్తాం కాని ఆచరించం. రెండు ఆచరిస్తాం కాని పైకి చెప్పం అని ఏ మహానుభావుడు అన్నాడోగాని, అది తు.చ. తప్పకుండా పాటించింది మృదుల. నా మీద ఆధారపడకూడదని ముందే నిర్ణయించుకుంది.

అరటి చెట్టు రెండుసార్లు కాయ



## అంతరం

దేవుళ్లు అందరిలో గొప్పవాడెవరు! అడిగింది టీచర్.

"ఏడుకొండల స్వామి"

ఎలా!

ఆయనకున్నన్ని నగలు ఏ దేవుడికీ ఉండవ్ కదాండి.

—సుమారేష్మా (పెనుగొండ).

దంటారు. నీవు మొదటిసారే కాయలేదు. అంటే మంజుల విషయంలో బాధ్యతలు తీసికోలేదు. ఇంక రెండవసారి మృదుల విషయంలో ఏ విధంగా నీపై ఆశలు పెట్టుకుంటాం. కావాలంటే తల తాకట్టు పెట్టుకోగలంగాని, నీ నుండి ఏమీ ఆశించలేం. ఆశించం కూడా. ఆశించినా ఫలితం ఉండదని మాకు బాగా తెలుసు.

నీవూ, మాధురి కలసి మీ అత్తవారింటికి వస్తారు. కాని ఇక్కడకు రారు. వచ్చినా మొక్కుబడిగా, మాధురిని అక్కడ వదిలి నీవు ఒక్కడవూ వచ్చి ఒక్కపూట అతికష్టంగా ఉండి వెళ్లిపోతావు. నా పెంపకంలో లోపం ఉందా! ప్రపంచం మారడం వలన అలా జరుగుతుందా అని ఎన్నోసార్లు నాలో నేనే ప్రశ్నించుకున్నాను. నా కొడుకూ కోడలితో గడపాలని ఎంతో ఆశగా ఉంటుంది. కాని గడపదాటి నీ యింటికి రాలేను. ఏదో భయం నాలో. నా కొడుకే నాకు పరాయివాడయితే నేను ఏం చేయగలను.


నిన్ను కన్నందుకు ఇంటి భారం అంతా నీపై మోపాలని నేను ఏనాడూ ప్రయత్నించలేదు. నాకు ఇష్టం లేదు కూడా. కానీ నీకై నీవు ఏదైనా సహాయం చేస్తావని ఆశపడ్డాను. కాని అది జరగలేదు. కాని మీ నాన్నగారు నీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అందుకే నీవు రాని ప్రతిసారీ బాధపడేవారు. చివరకు ఆ బాధతోనే వెళ్లిపోయారు. నన్ను ఒంటరిని చేసి, లోపల బాధపడేవారు. ఆయన మనసు నాకు మాత్రమే అర్థం అయేది. పైకి మాత్రం నిన్ను ఏమీ అననిచ్చేవారు కాదు. ఇంట్లో నలుగురం కూడా నీవు కాస్త సహాయం చేస్తే బావుంటుందని ఒకరికి తెలియకుండా ఒకరం ఆశపడ్డవాళ్లమే. కాని ఎవరం బయటకు మాట రానీయలేదు. పొరపాటున ఎవరో ఒకరు నోటి మాట తూలబోయినా మిగిలినవారు తమ మనసులో ఏ బాధా లేనట్లు నిన్ను ఏమీ అననిచ్చేవారు కాదు. నీవు మన కుటుంబంలో ఒకడివి. ముఖ్యంగా మా రక్తంలో రక్తానివి. నీవి అన్నీ నాన్నగారి పోలికలు. దేవుడు మనుషులు అందరినీ సృష్టించడు. ఒకో వంశంలో ఒకరిద్దరిని కష్టపడి సృష్టించి భూమిపై మొట్టమొదట వాళ్లను వదిలేసాడు. ఇప్పుడు రెస్టు తీసికుంటున్నాడు. అప్పటి నుండి అవే పోలికలు, అవే గుణాలు వస్తున్నాయి. ఎవరి వంశ రక్తం వాళ్లలో ప్రవహిస్తుంది. దానితోపాటు చాల వరకు తలరాతలు కూడా తాతముత్తాతలవి, తల్లిదండ్రులవి వస్తున్నాయి.

నీ తండ్రి తలరాతే నీకూ వచ్చిందనుకో. నీవు చాలా అన్యాయం అయిపోతావు. మాధురి గర్భవతి అని విన్నాను. కడుపులో పెరిగేది ఆడపిల్ల అని తెలిసి అబార్షన్ చేయించడానికి నిర్ణయించుకున్నావనీ విన్నాను. నీకు కొడుకు మీద ఎందుకు మమకారం. కూతురంటే చులకన భావం ఎందుకు. కూతుళ్లుగా పుట్టిన మృదుల, మంజుల గుండెలమీద కుంపట్లు కాలేదే. కొడుకుగాపుట్టి నీవు మమ్మల్ని ఏమి ఉద్ధరించావు! రేపు నీ కొడుకు నిన్ను ఎలా ఆదరిస్తాడు! ఆలోచించు. బాగా ఆలోచించు. ఆడపిల్లి, మగపిల్లాడు అనే భేదం ఉండకూడదు అనే నిశ్చయం కలిగేలా దృఢంగా ఆలోచించు.

ఆపై నిర్ణయం తీసికో. వద్దు. వద్దు. ఆ నిర్ణయం మాత్రం నా కొదిలెయ్. మాధురి కి కడుపు శోకం మిగలనీయకు. భవిష్యత్తు లో మీ నాన్న గారిలా నీవు బాధపడకూడదని, పిల్లల్ని పెంచేటప్పుడు ఆడమగ తేడా లేకుండా పెంచాలని, ఈ అమ్మ కోరిక. ఉంటానిక!

ప్రేమతో అమ్మ
లలిత.

*




డిజైన్: కె. రేఖ (అమలాపురం)